'దారు సలాం మజ్లిస్ సభను అడ్డుకుంటాం'


ఉమామహేంద్ర

చార్మినార్: పశ్చిమబెంగాల్ తరహాలో హైదరాబాద్ నగరంలో కూడా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు జరుగుతున్నాయని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమామహేంద్ర ఆరోపించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 19న నిర్వహించే సభను అడ్డుకొని తీరుతామని ఆయన స్పష్టంచేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..మజ్లిస్ సభను అడ్డుకోవడానికి 'చలో దారు సలాం'కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున్న తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సభ నిర్వహించే అసదుద్దీన్ ఒవైసీ వక్ఫ్ ఆస్తులు ఎవరి కబ్జాలో ఉన్నాయో ముందు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అలా వెల్లడిస్తే తాము కూడా వాటిని సమర్థిస్తామని పేర్కొన్నారు. కొందరి చేతుల్లో కబ్జాలో ఉన్నందునే పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులు చెందాలన్న ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఈ వక్ఫ్ చట్ట సవరణ చేపట్టారని పేర్కొన్నారు.

అవార్డుల ప్రదానం


మధుకు స్ఫూర్తిరత్న అవార్డును అందజేస్తున్న చెరుకు రాంచందర్, ఇటుక రాజు

గన్‌ఫౌండ్రీ: ప్రజా సేవకుడు కొప్పుల మధు స్ఫూర్తిరత్న అవార్డును అందుకున్నాడు. భారత రత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని గురువారం రవీంద్రభారతిలో ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్‌లు ఇటుకరాజు, చెరుకు రాంచందర్ ఆయనకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై పోరాటం, సామాజిక సేవలను గుర్తించి అవార్డును ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పని చేస్తానని తెలిపారు.

స్నాప్‌చాట్‌లో పరిచయమై..

బంగారం, డబ్బు కాజేశాడు

లంగర్‌హౌస్: స్నాప్‌చాట్‌లో పరిచయం అయిన యువకుడు యువతిని నమ్మించి బంగారం, డబ్బులు కాజేశాడు. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..లంగర్‌హౌస్ ఎండీ కాలనీలో నివాసముండే రషీదా బేగం కుమార్తె (17) మెహెక్ బేగం ఇంట్లోనే ఉంటుంది. అహ్మద్ కాలనీలో నివాసముండే మొహమ్మద్ ఫయాజ్(20)తో మెహెక్ బేగంకు స్నాప్‌చాట్‌లో 2024 సెప్టెంబర్‌లో పరిచయం ఏర్పడింది. పరిచయం అయిన రెండు నెలల తర్వాత డబ్బులు అవసరం ఉందని ఆ అమ్మాయిని నమ్మించి రూ.20 వేలు తీసుకున్నాడు. తర్వాత వారం రోజులకు మరో రూ.5 వేలు తీసుకున్నాడు. రెండు నెలల క్రితం రంజాన్ ఖర్చులకు డబ్బులు కావాలని అడగగా వారం వ్యవధిలో తులం బంగారం అతనికి ఇచ్చింది. అయితే బంగారం కనిపించకపోవడంతో తల్లి విచారించగా స్నాప్‌చాట్‌లో పరిచయం అయిన యువకుడికి ఇచ్చినట్లు తెలిపింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు ఫయాజ్ కోసం వెతుకుతున్నారు.

విశ్వకర్మలు అన్ని రంగాల్లో రాణించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

నాంపల్లి: వివిధ రంగాల్లో నిష్ణాతులైన విశ్వ బ్రాహ్మణ ప్రముఖులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలను విశ్వకర్మ ఆర్క్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని పోలీస్ ఆఫీసర్స్ మెస్‌లో నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా పూర్వ అదనపు వైద్య సంచాలకులు-(కర్నూలు) డాక్టర్ కేఏస్ తిరుమల ఆచార్య, శ్రీశ్రీశ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి ఎనిమిదవ తరం ముని మనుమడు శ్రీశ్రీశ్రీ నోస్సం వీరంభట్లయ్య స్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ బ్రహ్మశ్రీ సింహాద్రి కనకాచారి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఏస్ తిరుమల ఆచార్య మాట్లాడుతూ..విశ్వకర్మలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విశ్వకర్మ అభ్యున్నతి కోసం విశ్వకర్మ ఆర్క్ ఫౌండేషన్‌ను స్థాపించడం సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్ స్థాపించిన అనతి కాలంలోనే విభిన్న రంగాల్లో విశేషమైన సేవలందిస్తున్న విశ్వకర్మ ఆణిముత్యాలను గుర్తించి, వారందరిని ఒకే వేదికపైకి ఆహ్వానించి సత్కరించుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ కె.ఎం.కిరణ్‌కుమార్, హైదరాబాద్ వాటర్ వర్క్స్ విశ్రాంత జనరల్ మేనేజర్ పందూరు ప్రసాద్, సంఘ సేవకులు బంగారు తాతారావు, కలర్స్ హెల్త్‌కేర్ గ్రూప్ నేషనల్ హెడ్ డాక్టర్ నాగోజు నాగార్జున సమన్వయ కర్తలు వ్యవహరించారు.

పురస్కార గ్రహీతలు వీరే..

డాక్టర్ వేలు ఆనందచారి (ప్రముఖ శిల్పాచార్యులు)-శిల్పిశ్రేష్ఠ పురస్కారం, డాక్టర్ కస్యప్ దాకోజు(బహుముఖ ప్రజ్ఞాశాలి)-కళా వల్లభ పురస్కారం, డాక్టర్ బాలాజీ దాకోజు (పర్యావరణ వేత్త)-పర్యావరణ మిత్ర, డాక్టర్ టి.వెంకటేశ్వరరావు (పారిశ్రామికవేత్త)- పారిశ్రామిక పితామహ, డాక్టర్ కె.చాణక్య కిషోర్(కార్డియాలజిస్ట్)-వైద్య రత్న, డాక్టర్ నాగార్జున కొండ వెంకట సుందరాచారి(న్యూరాలజిస్ట్)-వైద్య రత్న, డాక్టర్ వజ్రాల శివకుమార్(న్యూరోసర్జన్)-వైద్య రత్న, ఎస్.నాగార్జునాచార్యులు (సైంటిస్ట్)-ఆవిష్కర్తోత్తమ, డాక్టర్ కె.వీర బ్రహ్మం(సైంటిస్ట్)-ఆవిష్కర్తోత్తమ, జవ్వాది కూర్మాచార్యులు(సంఘ సేవకులు)-సంఘశ్రేష్ఠ, కొచ్చెర్ల సూర్య భాస్కరావు-(రిటైర్డ్ అధికారి-బిఎస్ఎన్ఎల్)-అభినవకర్ణ, డాక్టర్ చంద్రపాటి నాగ వరప్రసాద రావు(పీఠాధిపతులు)-వేదపరిశోధక రత్న, పెంట శ్రీనివాస ఆచార్య(విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ నిర్వాహకులు)- సేవా రత్న, చేపూరి ఉమాచారి (డీఎస్పీ-సీఐడీ)-ప్రజా రక్షక, కటకం శ్రీనివాస ఆచార్య(ఛారిటీ వ్యవస్థాపకులు) -సేవా రత్న, చేపూరి జేవి కుమార్ (ప్రముఖ కవి) -సాహితీ సామ్రాట్, పట్నాల కనకదుర్గ నాగేశ్వర రావు (న్యాయస్థాన ఉన్నతాధికారి)-న్యాయబంధు, పెద్దోజు నాగేశ్వరరావు(ప్రముఖ పండితులు) -పండిత పితామహ, అప్పలభక్తుల శివ కేశవరావు (ఉపన్యాసకులు)-సభా సామ్రాట్, భవిరి రవి(ధ్వన్యనుకరణ)-సరావధాన చక్రవర్తి, సంభాన సత్యనారాయణ(వ్యాపారవేత్త)-వాణిజ్య సామ్రాట్, కన్‌గుంది చంద్రశేఖర్ ఆచారి (రాజకీయం)-ప్రజాబంధు, డాక్టర్ బి.ఎం.ఉమేష్‌కుమార్ (పారిశ్రామికవేత్త)-ప్రజాబంధు, బ్రహ్మశ్రీ గురజాడ మధుసూదనరావు(టీటీడీ ఆస్థాన గాయకులు)-గాన గంధర్వ పురస్కారాలు అందుకున్నారు.

మజ్లిస్ నాయకులు క్రియాశీలకంగా ఉండాలి


మజ్లిస్ సీనియర్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులందరూ క్రియాశీలకంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మజ్లిస్ సీనియర్ నాయకులతో పాటు మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తమ తమ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని వాటిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిశీలిస్తుండాలన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మజ్లిస్ పార్టీ ఈ నెల 19న దారుసల్లాంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తుందని ఈ విషయంపై బాగా ప్రచారం చేయాలని ఆయన కోరారు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ సభకు నాయకత్వం వహించి ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలీముద్దీన్, అబ్బాస్ హుస్సేన్, మాజీద్‌ఖాన్, అబ్బు తదితరులున్నారు.

ఆకట్టుకుంటున్న టోలిచౌకీ చౌరస్తా



గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తా, దాని పరిసరాలు చూపరులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. చౌరస్తా వద్ద ఉన్న ఫ్లై ఓవర్ పిల్లర్‌లపై ఆలోచింపజేసే బొమ్మలను వాహనాదారులు వాహనాలు ఆపి మరి చూస్తున్నారు. మరోవైపు టోలిచౌకీ చౌరస్తా నుంచి హకీంపేట్ వెళ్లే మార్గంలో బేక్‌వెల్ ముందు నిర్మించిన రైల్ ఇంజన్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టోలిచౌకీ నుంచి జూబ్లీహిల్స్ అపోలో, హకీంపేట్, బంజారాహిల్స్ వెళ్లే వారిని ఈ రైలు నమూనా ఎంతో ఆకట్టుకుంటుంది.

అధికారులు స్పందించారు..మార్కింగ్ చేశారు..

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డుకు మార్కింగ్ చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

నాంపల్లి: రోడ్ల విస్తరణ జరిగేదెన్నడో..? అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఏప్రిల్ 2న ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. స్పందించిన మెహిదీపట్నం సర్కిల్-12 టౌన్ ప్లానింగ్ అధికారులు పాత ముంబాయి హైవే రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లకు గురువారం మార్కింగ్ చేశారు. నోబుల్ టాకీస్ చౌరస్తా నుంచి సీతారామ్‌భాగ్ వరకు మార్కింగ్ చేశారు. ఈ రోడ్డు నిత్యం ట్రాఫిక్‌తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కింగ్ చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది రోడ్డును పూర్తి స్థాయిలో ఎప్పుడు కూల్చివేస్తారో వేచి చూడాల్సిందే.

అన్నదానం



గోల్కొండ: షేక్‌పేట్‌లోని సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రతినిధులు ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఈ పూజలకు తరలివచ్చారు.

మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

- 52 కేసులు నమోదు

యాకుత్‌పురా: మైనర్ డ్రైవింగ్‌పై గత వారం రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేశామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ న యీముద్దీన్ తెలిపారు. గురువారం రాత్రి స్టేషన్ పరిధిలోని పురానిహవేలి ప్రాంతాల్లో ఆయన సిబ్బందితో కలిసి మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజులుగా మైనర్ డ్రైవింగ్‌పై డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. దారుషిఫా, సాలార్‌జంగ్ రోటరీ, యాకుత్‌పురా, ఐఎస్ సదన్, బీబీ బజార్ చౌరస్తా, ఎంజీబీఎస్ బస్ స్టేషన్ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో ఇప్పటి వరకు 52 కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు 18 ఏళ్లలోపు తమ పిల్లలకు వాహనలు నడపడానికి ఇస్తే మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ డ్రైవ్‌లో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు

డబీర్‌పురా: నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, ఎస్సై అరుణోదయ తెలిపిన వివరాల ప్రకారం.. నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన షేక్ ఖయ్యూమ్ నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేస్తూ స్థానిక దుకాణాదారులకు సరఫరా చేస్తున్నాడు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న మీర్‌చౌక్ పోలీసులు దాడులు చేసి 300 లీటర్ల నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. లాన్సర్ నెట్‌వర్క్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ ఇన్వేస్టిగేషన్ ఆఫీసర్ శశిధర్ రావు ఫిర్యాదు మేరకు పోలీసులు షేక్ ఖయ్యూమ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలోని బోరబండ-హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని యువకుడు(35) బోరబండ-హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు టీషర్టు, అదే రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి రైల్వే పోలీసులను లేదా 040-2322238, 98483 49544 లలో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధర్నాకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


ప్లకార్డుల ప్రదర్శన చేపట్టిన అంజన్‌కుమార్ యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్, ధన్‌రాజ్


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పాతబస్తీ కాంగ్రెస్ పార్టీ నాయకులు

అబిడ్స్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం గోషామహల్ నుంచి ఈడీ కార్యాలయం వరకు భారీ ఎత్తున ప్రదర్శన చేపట్టారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. శ్యామ్ సింగ్, కిషన్, సుభాష్, చంద్రమోహన్, విశ్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కక్ష రాజకీయాలకు పాల్పడుతుంది..

అఫ్జల్‌గంజ్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కక్ష రాజకీయాలకు పాల్పడుతుందని మాజీ ఎంపీ, ఆల్ ఇండియా రాష్ట్ర సీనియర్ నాయకుడు ఎం.అంజన్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ అగ్ర నాయకులపై ఈడీ కేసులు నమోదు చేయించడం దారుణమన్నారు. ఆదర్శ్‌నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బషీర్‌బాగ్ ఈడీ ఆఫీస్ వరకు ప్లకార్డులతో భారీ ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ నుంచి..

గోల్కొండ: కాంగ్రెస్ అధినాయకులపై కక్షసాధింపు చర్యలు సాధించడానికి బీజేపీ ప్రభుత్వం ఈడీని తమ ఆయుధంగా వాడుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ఈడీ వైఖరిని ఖండిస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి కార్వాన్ నుంచి ఆయన ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, హమీద్‌ఖాన్, కిషన్, రవీందర్ ఉన్నారు.

పాతబస్తీ నుంచి..

గౌలిపురా: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై బీజేపీ రాజకీయ వేధింపులకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి పాతబస్తీ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్, పీసీసీ కార్యదర్శి అల్లం భాస్కర్, నాయకులు ఎన్.ప్రమోద్ రెడ్డి, డల్లు శివ, సయ్యద్ దిలావర్ ఉన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నిర్మల్‌కుమార్ యాదవ్


కార్వాన్ నుంచి కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో..

పర్యాటక రంగ అభివృద్ధికి ఆధునిక సాంకేతికత కీలకం


మాట్లాడుతున్న కుమార్ మొగులారం

చార్మినార్: పర్యాటక రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగమని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కుమార్ మొగులారం అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీస్ వంటి ఆధునిక సాంకేతికను వినియోగించి పర్యటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తే లక్షలాది ఉద్యోగావకాశాలు సృష్టించవచ్చన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీవితంలో ఒత్తిడులు తట్టుకోవడానికి, ఆధ్యాత్మిక భావనలతో, ప్రకృతి సౌందర్యాభిలాషతో పర్యటకులు వివిధ ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వ విద్యాలయం కామర్స్ డీన్ ఆచార్య కృష్ణ చైతన్య మాట్లాడుతూ..గత దశాబ్ద కాలంలో తెలంగాణలో అనేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలు దేశవ్యాప్తంగా పర్యటకులను ఆకర్షిస్తున్నాయని, నూతన పర్యటక విధానంతో హోటల్స్, మోటల్స్, ట్రాన్స్ పోర్ట్ తదితర రూపాలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన డా.నీరజ మాట్లాడుతూ..వందేళ్ల చరిత్ర కలిగిన చారిత్రక కట్టడంలో ఉన్న సిటీ కాలేజీలో పర్యటక రంగంపై సదస్సు నిర్వహించడం ఔచిత్యవంతంగా ఉందన్నారు. కామర్స్ విభాగం అధ్యక్షుడు డా.కె.మల్లికార్జునరావు, కన్వీనర్ డా.ఝాన్సీ రాణి, లలిత చైతన్య, డా.శిరీష, ఇఫత్ ఉన్నీసా, డా. రవీంద్రబాబు, సైదులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ..యాక్సెస్ ఫౌండేషన్ వారు విజన్ డ్రైవ్‌లో భాగంగా గత నెలలో మొదటి ఉచిత వైద్య కంటి పరీక్ష శిబిరం నిర్వహించారన్నారు. అందులో వైద్య పరీక్షలు నిర్వహించిన వారిలో పలువురికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా కళ్లద్దాలు అవసరమైన వారికి యాక్సెస్ ఫౌండేషన్ వారు కంటి అద్దాలు ఉచితంగా ఇచ్చారన్నారు. మొత్తం రెండు శిబిరాల్లో 200 మందికి రూ.40 వేల విలువ చేసే కంటి అద్దాలను పంపిణీ చేశారని ఆమె తెలిపారు. కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు కూడా కంటి పరీక్షలు నిర్వహించుకున్నారన్నారు.

'టీసీహెచ్ఓ' రాష్ట్ర కమిటీ ఎన్నిక


నెహ్రూ చంద్ నాయక్


మురళీధర్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: తెలంగాణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీసీహెచ్ఓ) రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రాష్ట్ర కార్యాలయంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సభ్యులు పాల్గొని రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా బానోతు నెహ్రూ చంద్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మధుసూధన్‌రెడ్డి, సక్కుబాయి, దుర్గారావు, గ్యానసుందరి ఎన్నికయ్యారు. అదేవిధంగా రాష్ట్ర కోశాధికారిగా మహల, సంయుక్త కార్యదర్శిగా బరత్‌కుమార్, రోజారాణి, సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా మోతీలాల్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదా నాయక్, తెలంగాణ పారా మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు దేవిసింగ్, టీజీఓ కార్యదర్శి మాదవరెడ్డి, హనుమా నాయక్, టీజీఓ మెడికల్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సునీల్‌రాజ్‌తో పాటు వివిధ సంఘాలు నాయకులు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గుడిమల్కాపూర్‌లో బీజేపీ నేతల పాదయాత్ర


గుడిమల్కాపూర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకుడు అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రధాని మోదీ సాధించిన విజయాలు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిని ప్రజలకు వివరించారు. గచ్చిబౌలి కంచ భూములను అమ్మేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ఉత్సాహం చూపారని అయితే సుప్రీంకోర్టు ముఖ్యమంత్రి వైఖరికి తీవ్రంగా విమర్శించి ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు, నిరుపేద ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఆయన వెంట బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్, కట్ల అశోక్, జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్


సత్కరిస్తున్న విక్రమ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, రాజ్‌కుమార్

అబిడ్స్: ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్ ఉంటుందని టీఎన్జీఓస్ హైదరాబాద్ అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆదేశాల మేరకు సిటీ సెంట్రల్ లైబ్రరి కార్యదర్శి పద్మ, సుఖేష్‌కుమార్ సమస్యలను వారు పరిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైదిక్ శాస్త్రి, ముఖీద్, మహేందర్, వరప్రసాద్, సత్యనారాయణ, శేఖర్, సాయి, సూర్య, రతన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జలమండలి సహకారంతో పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్నామని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. గురువారం డివిజన్‌లోని సుధా మెడికల్ హాల్, పత్తరికి మజీద్ కమాన్ తదితర ప్రాంతాల్లో కలుషిత నీటిపై ఫిర్యాదులు రావడంతో పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపాదికన పైప్‌లైన్ మరమ్మతుల పనులను చేపట్టడం జరిగిందన్నారు. గత కొంత కాలంగా జాంబాగ్ డివిజన్ ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కావడంతో జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఈ పనులు హనుమాన్ జయంతి శోభాయాత్ర వల్ల కొంత వాయిదా పడిందని, ప్రస్తుతం యుద్ధ ప్రాతిపదికన పనులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

మాదిగ అమరవీరుల త్యాగ ఫలితమే వర్గీకరణ


మాదిగ అమరవీరుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారుల వేదిక ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: మాదిగ అమరుల త్యాగ ఫలమే నేటి వర్గీకరణ అని మాదిగ దండోర ఉద్యమకారుల వేదిక చైర్మన్ డాక్టర్ రుద్రవరం లింగస్వామి మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అమరులైన మాదిగ అమరవీరులకు వర్గీకరణ జీఓ కాపీలతో గురువారం ఎంజే మార్కెట్ వద్ద ఉన్న మాదిగ అమరవీరుల విగ్రహాల వద్ద పెట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విజయం మాదిగ అమరవీరులకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి వచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణ ద్వారా ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరూ మాదిగ అమరవీరుల విగ్రహాల వద్దకు ఉద్యోగ పత్రాలతో వచ్చి నివాళులర్పించాలని, మొదటి నెల జీతంలో సగం అమరవీరుల కుటుంబాలకు ఇవ్వాలని కోరారు. అమరవీరుల త్యాగాలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం మాదిగ అమరవీరుల స్మృతి వనాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోర ఉద్యమకారుల వేదిక అధ్యక్షులు జిల్లా వెంకటేష్ మాదిగ, మాదిగ అమరవీరుల కుటుంబసభ్యులు, ఉద్యమకారుల వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.